క్లుప్తంగా

పరిశుభ్రత పాటించాలి


పందలపాకలో మాట్లాడుతున్న సిబ్బంది

బిక్కవోలు: ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని మహిళ సంక్షేమ కార్యదర్శి కాంచన అన్నారు. పందలపాకలో గురువారం అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో కిశోర వికాసం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ పదో తేదీ వరకూ గ్రామాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. 11 ఏళ్ల నుంచి 18 ఏళ్లలోపు బాలికలు ఆపద సమయాల్లో ఎలా స్పందించాలి, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు.

రక్తదానంతో ప్రాణదాతలు కావొచ్చు


రక్తదానం చేస్తున్న దాత

రాజానగరం: రక్తదానం ద్వారా ప్రమాదాల బారిన పడిన వారి ప్రాణాలను కాపాడి, ప్రాణదాతలు కావొచ్చని ప్రముఖ వైద్యుడు పి.నాగ సత్యప్రసాద్ అన్నారు. దివాన్ చెరువు బీజాపురీ టౌన్‌షిప్‌లోని షిరిడీ సాయి జూనియర్ కళాశాలలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని డ్యాఫ్నీ సివిల్స్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ టీఎస్ విద్యామదన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


బిక్కవోలులో ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణ

బిక్కవోలు: దేశ సరిహద్దులో ఏర్పడిన అలజడి నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ అన్నారు. ఆయన గురువారం అధికారులతో కలిసి స్థానిక వైఎస్సార్ జంక్షన్ వద్ద మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాద దాడులు జరిగితే ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టాలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మండలంలోని కంట్రోలు రూమ్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ రెడ్‌క్రాస్ దినోత్సవం


రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న నాయకులు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురం డాక్టర్ సత్యం రమేష్‌బాబు హాస్పటల్లో గురువారం అంతర్జాతీయ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మండల శాఖ లైఫ్ మెంబర్ డాక్టర్ సత్యం రమేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసీల్దార్ ఎ శ్రీనివాస్, ఎంపీడీవో ఎం.భారతి, ఎస్సై డి.రామ్‌కుమార్ హాజరయ్యారు. రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు డాక్టర్ జాన్ హెన్రీ డూనాంట్ చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సంస్థ 191 దేశాల్లో సేవలు అందిస్తోందన్నారు.

నర్సరీని సందర్శించిన తెలంగాణ ఎమ్మెల్యే

కడియం: బుర్రిలంకలోని ఉమా పార్వతి నర్సరీని తెలంగాణలోని వరంగల్ జిల్లా నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి బ్రదర్స్ శివాజీ, మూర్తి సృష్టించిన టాల్ బోన్సాయ్ నర్సరీలో వందేళ్ల వయసున్న వృక్ష జాతి మొక్కల గురించి తెలుసుకున్నారు. ఆ మొక్కల వల్ల కలిగే ప్రయోజనాలు, పెంపకం గురించి కూడా మూర్తి వివరించారు.

ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ దేశానికి, పర్యావరణానికి కడియం నర్సరీ రైతుల చేస్తున్న సేవలు చాలా విలువైనవన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా కడియం నర్సరీల ద్వారా లక్షల మంది ఉపాధి పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో ముత్యం జగదీష్, అలంపల్లి శ్రీను, స్థానిక నర్సరీ రైతులు పాల్గొన్నారు.

బీమాతో కూలీలకు ధీమా

- ఉపాధి కూలీలకు బీమా సౌకర్యం
- ప్రమాదం, సహజ మరణానికి రూ.2 లక్షలు
- జాబ్ కార్డు ఉన్నవారికి వర్తించేలా చర్యలు


రంగాపురంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

బిక్కవోలు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు ఇప్పటి వరకు జీవిత బీమా సౌకర్యం లేదు. ఈ నేపథ్యంలో జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి బీమా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. గ్రామీణ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు అనపర్తి నియోజకవర్గంలోని 45,790 జాబ్ కార్డుల్లో ఉన్న 73,255 మంది కూలీలకు బీమా సౌకర్యం కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎఫ్ఏ లేదా మేట్ అందజేసే దరఖాస్తుపై కూలీలు సంతకం పెట్టి అప్పగిస్తే బ్యాంకు ఖాతాల నుంచి ప్రీమియం మినహాయించుకుంటారని అధికారులు వెల్లడిస్తున్నారు. అయితే ఈ పథకం వర్తింపజేసేందుకు కూలీలు చొరవ చూపి అధికారులకు సహకరించాల్సి ఉంది.

బీమాలో రెండు రకాలు

కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి సురక్ష యోజన, ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి యోజన కింద బీమా భరోసాను కల్పించాలని కార్యచరణ రూపొందించింది. మొదటి బీమా ప్రీమియం కింద ఏడాదికి రూ.20 చెల్లించాల్సి ఉంటుంది. ప్రమాదవశాత్తూ కూలీ మృతి చెందితే రూ.2 లక్షల బీమా అందజేస్తారు. రెండో దానికి సంబంధించిన ప్రీమియం రూ.436 చెల్లించాలి. సహజ మరణం లేదా ప్రమాదం జరిగి మృతి చెందితే రూ.2 లక్షలు ఇస్తారు.

కూలీల కుటుంబాలకు అండగా

ప్రస్తుతం వేసవి నేపథ్యంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయి. కూలీల్లో వయసు మళ్లిన వారు., ఆరోగ్య సమస్యలున్న వారు అనేక మంది ఉంటారు. దీని కారణంగా వేసవి దృష్ట్యా అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ప్రధానంగా వడదెబ్బ ప్రభావం ఇతర కారణాలతో మృతి చెందితే బీమా వర్తిస్తుంది. ఫలితంగా వారి కుటుంబాలకు నగదు సాయం ఆసరాగా ఉంటుందని ఉపాధి హామీ అధికారులు చెబుతున్నారు. యుద్ధప్రాతిపదికన జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీ బీమా ప్రీమియం చెల్లించాలని కోరుతున్నారు. రెండు రకాల బీమా పథకాలను కూలీలు పొందాలని సూచించారు. దీనిపై మండలాల్లో సమావేశాలు పెట్టి అవగాహన కల్పిస్తున్నారు. మండే ఎండల వల్ల ఉపాధి పనులకు సైతం కూలీలు సక్రమంగా వెళ్లడం లేదు.

నియోజకవర్గంలో వివరాలు

మండలం	జాబ్ కార్డులు	కూలీలు
అనపర్తి	8,372	12,738
బిక్కవోలు	11,355	18,815
పెదపూడి	13,546	23,398
రంగంపేట	12,517	18,304
మొత్తం	45,790	73,255

సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగిన ఉపాధి కూలీలందరూ విధిగా బీమా సౌకర్యం పొందాలి. బ్యాంక్ ఖాతాల నుంచి ప్రీమియం మినహాయించుకుంటారు. ఎవరికీ నేరుగా నగదు చెల్లించాల్సిన అవసరం ఉండదు.

– శ్రీనివాస్ ఎంపీడీవో, బిక్కవోలు

యుద్ధ సమయంలో జాగ్రత్తలపై మాక్ డ్రిల్

- కోరుకొండలో ప్రజలకు అవగాహన
- పాల్గొన్న పలు శాఖల అధికారులు


క్షతగాత్రుడిని తరలించడంపై అవగాహన కల్పిస్తున్న పోలీసు


బాధితుడిని రక్షించే విధానంపై అవగాహన

కోరుకొండ: మండల కేంద్రమైన కోరుకొండలో గురువారం మాక్ డ్రిల్ నిర్వహించారు. పాకిస్థాన్‌తో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో వైమానిక దాడులు జరిగితే ఏ విధంగా రక్షించుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎంపీడీవో బత్తిన అశోక్ కుమార్ మాట్లాడుతూ బాంబులు పడినప్పుడు, తుపాకీ కాల్పులు, వైమానిక దాడులు జరిగినప్పుడు ప్రజలు పరుగులు తీయకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇల్లు, బహిరంగ ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని, వైమానిక దాడులు జరిగే క్రమంలో పరుగులు తీయడం కాకుండా నేలకు ఆనుకుని రక్షించుకోవాలని, గ్యాస్, పెట్రోమాక్స్ లైట్లు, సెల్‌ఫోన్ నెట్‌వర్క్‌లను వినియోగించరాదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుస్వాగతం, ఎస్సై కూన నాగరాజు, కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు, పోలీసులు పాల్గొన్నారు.

అడుగడుగునా ఆధ్యాత్మిక శోభ

- ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణాలు
- నూతన విగ్రహాల ప్రతిష్ఠ
- కిటకిటలాడిన ఆలయాలు


సంపరలో వేంకటేశ్వరస్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న హనుమంతాచార్యులు తదితరులు

పెదపూడి: అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో గురువారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. పలుచోట్ల వేంకటేశ్వరస్వామివారి కల్యాణాలు ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సంపరలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో ఖండవిల్లి శ్రీనివాసాచార్యులు కల్యాణ క్రతువులు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా భక్తులకు విసనకర్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ అద్దంకి అప్పారావు, అడపా సూరిబాబు, అడపా అర్జునరావు, అడపా రాంబాబు కుటుంబ సభ్యులు యజ్ఞకర్తలుగా కూర్చున్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠోత్సవం

పెదపూడి: పుట్టకొండ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి కాలనీలో నిర్మించిన వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో గురువారం ఉదయం 6.55 గంటలకు నూతన విగ్రహాల ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వల్లు వెంకట రమణ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

బిక్కవోలు: తూర్పుతిరుమలగా ప్రసిద్ధి చెందిన బలభద్రపురంలోని శ్రీదేవి భూదేవి సహిత ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి కల్యాణం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కల్యాణ కర్తలుగా వడింపల్లి వెంకట ఫణీంద్రవర్మ, దివ్యరాణి దంపతులు వ్యవహరించారు. అర్చకులు పెద్దింటి రామగోపాలాచార్యులు, వేదాంతం పవన్‌కుమార్ చార్యులు ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మల్లిడి గంగారెడ్డి, నల్లమిల్లి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని తీర్థమహోత్సవాలు

రాజానగరం: స్థానిక రావుల చెరువు గట్టున కొలువైవున్న అలివేలు మంగ, పద్మావతీ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి తీర్థమహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రాత్రి 7.35 గంటలకు కొల్లూరి రామలింగేశ్వరరావు దంపతులు, శీరంశెట్టి కుమారస్వామి దంపతుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక కళాకారులచే నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో భాగంగా శనివారం అన్నసమారాధన చేస్తారు. ఆఖరి రోజైన సోమవారం రాత్రి రావుల చెరువులో పుష్పయాగం నిర్వహిస్తారు.

అనపర్తిలో..

అనపర్తి: అనపర్తిలోని కెనాల్ రోడ్డులో ఎస్‌బీఐ ఎదురుగా ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో అలివేలు మంగ, పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామివారి కల్యాణం కనుల పండువగా జరిగింది. అలాగే నల్ల కాలువ వంతెన వద్ద కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి దివ్య కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆయా ఆలయ కమిటీల ప్రతినిధులు, దాతలు, భక్తులు పాల్గొన్నారు.


పుట్టకొండలో సర్పంచ్ వెంకట రమణ దంపతులు


బలభద్రపురంలో స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు


అనపర్తి కెనాల్ రోడ్డులోని ఆలయంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం

పోలీసులు భయభ్రాంతులకు గురి చేయడం దారుణం


పెదపూడిలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ, పాత్రికేయులు

పెదపూడి: సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డి ఇంట్లోకి పోలీసులు దౌర్జన్యంగా ప్రవేశించి, భయభ్రాంతులకు గురి చేయడం హేయమైన చర్య అని పాత్రికేయులు అన్నారు. ఈ ఘటనకు నిరసనగా పెదపూడి మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ పీవీ సీతాపతిరావుకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెదపూడి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వల్లూరి వీర వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ విజయవాడలోని ఎడిటర్ ధనుంజయ్ రెడ్డి ఇంట్లోకి పోలీసులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యంగా ప్రవేశించి విధ్వంసం సృష్టించారని ఆరోపించారు. ఇది అమానుషమైన చర్య అన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కార్యదర్శి వారణాసి శ్రీనివాసు, కార్యవర్గ సభ్యుడు షేక్ వలీ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

రాజమహేంద్రవరం రూరల్: గంజాయి కేసులో పట్టుబడిన నిందితుడికి పదేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తూ జిల్లా ఎన్‌డీపీఎస్ కమ్ ఒకటవ అదనపు సెషన్స్ జడ్జి ఆర్.శివకుమార్ గురువారం తీర్పుచెప్పారు. వివరాల్లోకి వెళితే.. 2017 నవంబర్ 21న 266 కేజీల గంజాయిని నర్సీపట్నం నుంచి వరంగల్‌కు లారీలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. మొదటి నిందితుడైన విశాఖ జిల్లా మాకవరపాలెం మండలం తామరం గ్రామానికి చెందిన దల్లి కామిరెడ్డిని అప్పటి బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ కె.నాగమోహన్‌రెడ్డి అరెస్టు చేసి కోర్టు ఉత్తర్వులు మేరకు రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో పై విధంగా తీర్పు చెప్పారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున పీపీ లక్ష్మణ్ నాయక్ బలమైన వాదనలు వినిపించారు. అప్పటి దర్యాప్తు అధికారి కె.నాగమోహన్‌రెడ్డి, ప్రస్తుత బొమ్మూరు పీఎస్ ఇన్‌స్పెక్టర్ పి.కాశీవిశ్వనాథం పర్యవేక్షణలో కోర్ట్ హెడ్ కానిస్టేబుల్ పి.విశ్వేశ్వరరావు సాక్షులను సరైన సమయంలో ప్రవేశపెట్టి శిక్ష పడటానికి దోహదపడ్డారు.ఈ కేసులో రెండో నిందితుడైన విశాఖపట్నం జిల్లా గొలుగొండ మండలం లింగంపేటకు చెందిన బొద్దిన సురేష్‌కు ఈ నెల 2వ తేదీన న్యాయమూర్తి ఆర్.శివకుమార్ పదేళ్లు జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా విధించిన విషయం తెలిసిందే.

రివర్ సిటీస్ అలయన్స్‌తో నగరాభివృద్ధి


పుష్కర ఘాట్‌ను పరిశీలిస్తున్న బృంద సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: రివర్ సిటీస్ అలయన్స్ కార్యక్రమంతో రాజమహేంద్రవరం ముఖచిత్రమే మారిపోనుందని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. ఆయన సూచనల మేరకు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ బృందం గురువారం నగరంలో పర్యటించింది. రివర్ సిటీస్ అలయన్స్ అనేది నదీ తీరంలోని నగరాలను అభివృద్ధి చేసే బృహత్తర కార్యక్రమమని కమిషనర్ తెలిపారు. దీనిని నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా, నేషన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 2021 నవంబర్ 25న అప్పటి కేంద్ర జల్ శక్తి మంత్రి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ కార్యక్రమంలో 146 నగరాలకు సభ్యత్వం ఉందన్నారు. నగర పాలక, రెవెన్యూ, అటవీ, టూరిజం, రుడా అధికారులతో కలిసి రెండు రోజుల పాటు ఈ బృందం నగరంలో పర్యటించి 15కి పైగా నదీ సంబంధిత ముఖ్య ప్రాంతాలను పరిశీలించినట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

రాజమహేంద్రవరం రూరల్: అప్పుల బాధ తాళలేక లలితానగర్‌కు చెందిన కోలా శ్రీనివాసరావు (60) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం..

కోలా శ్రీనివాసరావు టి.నగర్‌లో నెల్లూరు మెస్ నిర్వహిస్తున్నాడు. గత రెండేళ్లుగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున మెస్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్సై శ్యామ్‌సుందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నైతిక విలువలు నేర్పించాలి

రాజానగరం: పిల్లలకు చిరుప్రాయం నుంచే క్రమశిక్షణతో పాటు నైతిక, మానవతా విలువలను నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు గురువులపై ఉందని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని పాలచర్ల గ్రామ పెద్ద గంగిశెట్టి పెదకాపు ఆధ్వర్యంలో జరిగిన సత్యసాయి బాలవికాస్ వారోత్సవం, ఈశ్వరాంబ వర్ధంతి జరిగాయి. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు, హౌసింగ్ బోర్డు కాలనీ సేవా సమితి కన్వీనర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వ్యక్తిపై చాకుతో దాడి

సీతానగరం: వంగలపూడికి చెందిన తుమ్మశెట్టి అంజయ్యపై చాకుతో దాడి చేసిన సీరుకొండ నారాయణపై ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. అంజయ్యకు దుర్గాదేవి అనే మహిళతో పరిచయం ఉంది. సుందరి అనే మహిళ ఇంటి వద్ద దుర్గాదేవి పనిచేస్తుంది. ఈ నేపథ్యంలో దుర్గాదేవి కోసం సుందరితో అంజయ్య మాట్లాడుతున్నాడు. ఆ సమయంలో సుందరి భర్త నారాయణ అతడిపై చాకుతో దాడి చేశారు. ఈ ఘటనలో అంజయ్య ఎడమచేతి మణికట్టుకు గాయమైంది. అతడికి 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రైస్ కార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

సీతానగరం: కొత్త రైస్ కార్డులకు దరఖాస్తులను సంబంధిత సచివాలయాల్లో అందజేయాలని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ దరఖాస్తుదారుల వార్షిక ఆదాయం రూ.1.20 లక్షల లోపు ఉండాలని, జీఎస్‌డబ్ల్యూఎస్ హౌస్ హోల్డ్ డేటా బేస్‌లో నమోదు అవ్వాలన్నారు. అలాగే మరణించిన సభ్యుల పేర్ల తొలగింపు, చిరునామా మార్పులకు కూడా అవకాశం ఉందన్నారు.

బహిరంగంగా మద్యం తాగిన వారికి జరిమానా

కోరుకొండ: మండలంలో పోలీసులు నిర్వహించిన దాడుల్లో బహిరంగంగా మద్యం తాగుతూ పట్టుబడిన 60 మందికి కోర్టు రూ.500 చొప్పున అపరాధ రుసుం విధించింది. ఈ సందర్భంగా సీఐ సత్యకిశోర్ విలేకరులతో మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠినమైన చర్యలుంటాయన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని రాజమహేంద్రవరం రూరల్ ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేవీబీ నటరాజన్ తెలిపారు. కాటవరం సబ్ స్టేషన్ నుంచి కొత్తగా 11 కేవీ కాటవరం ఫీడర్ లైన్ పనులు జరుగుతున్నాయన్నారు. దీంతో కాటవరం, జాలిమూడి గ్రామాలకు శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ సరఫరా ఉండదన్నారు.

ముగింపు సభలను జయప్రదం చేయాలి


ముగింపు సభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

రంగంపేట: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 12వ తేదీన జరిగే అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 50 వసంతాల ముగింపు సభలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రమేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం సింగంపల్లి గ్రామంలోని సీపీ రెడ్డి నగర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 1974లో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ సారథ్యంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఏర్పడిందన్నారు. కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసమే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసులపై యుద్ధం ప్రకటించి, ఎన్‌కౌంటర్ల పేరుతో హత్యలు చేస్తోందని విమర్శించారు. వెంటనే కగార్‌ను నిలిపివేసి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు, పీడీఎస్‌యూ(వి) రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్ పాల్గొన్నారు.

మానవ హక్కులపై సదస్సు


మానవ హక్కుల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరులోని ఎంపీఎస్ ఫంక్షన్ హాల్లో గురువారం మానవ హక్కులపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ క్రైమ్ అసోసియేషన్ ఢిల్లీ నేషనల్ చైర్మన్, హైకోర్టు అడ్వకేట్ బోడా రాకేష్ నాయక్ మాట్లాడుతూ మానవ హక్కులను చట్ట పరంగా ఎలా సాధించుకోవాలో తెలిపారు. ఈ సదస్సులో వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా ప్రెసిడెంట్ విజయసారథిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా, పీజీ కన్‌స్ట్రక్షన్స్ అధినేత దాడి నాగేశ్వరరావును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెసిడెంట్‌గా, నేషనల్ చైర్మన్‌గా బోడ రాకేష్ నాయక్‌ను నియమించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు.